సాక్షి అనకాపల్లి

సోమవారం ၊ 4 ၊ నవంబర్ ၊ 2024



ప్రాణం తీసిన ఈత సరదా

8లో

ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. స్నేహితులతో సముద్ర స్నానానికి వెళ్లిన అభిరామ్ అనే యువకుడు మృతిచెందాడు.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.

8లో



పీఎన్‌బీ సిబ్బంది వాకథాన్

ఏయూక్యాంపస్: విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ సిబ్బంది బీచ్ రోడ్డులో వాకథాన్ నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఏడు పదుల వయస్సు.. మూడు పతకాలు

మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన చినకన్నబాబు



జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన ఆదిరెడ్డి చినకన్నబాబు

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన ఆదిరెడ్డి చిన కన్నబాబు మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో కన్నబాబు 70 సంవత్సరాల వయసు పైబడిన విభాగంలో ఐదు కిలోమీటర్ల వాకింగ్, షాట్ పుట్‌లలో ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. 100 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ మెడల్ అందుకున్న కన్నబాబును మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికార్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించారు.

7న నర్సీపట్నంలో జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 7న నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 15 కంపెనీలతో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు సంస్థ జిల్లా అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పదో తరగతి నుంచి పీజీ వరకూ విద్యార్హతల గల, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే నిరుద్యోగులు www.naipunyam.ap.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9494791935, 9014765287 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జూ ఆదాయం రూ 3.47 లక్షలు

ఆరిలోవ(విశాఖ): జూ పార్కులో ఆదివారం కార్తీక మాసం సందడి నెలకొంది. పిల్లలు, పెద్దలు వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సరదాగా గడిపారు. యువకులు బ్యాటరీ వాహనాలు, సైకిళ్లపై సందడి చేశారు. జూను ఆదివారం సందర్శించిన 3,988 మంది ద్వారా రూ.3,46,744 ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఈ నెల 5న నాగులచవితి సందర్భంగా జూ పార్కు ఉదయం 7.30 గంటలకే తెరుస్తామన్నారు. పూజల కోసం వచ్చే భక్తులు ఎటువంటి బాణసంచా తీసుకురావద్దని సూచించారు.

అప్పన్నను దర్శించుకున్న రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ రజని



జస్టిస్ రజనికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈవో

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ పి. రజని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు అష్టోత్తరంపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదం , జ్ఞాపిక, శేషవస్త్రాన్ని అందజేశారు.

'సరుగుడు' వద్ద సందర్శకుల సందడి



జలపాతంలో జలకాలాడుతున్న సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. కార్తీకమాసం కావడంతో జలపాతంలో స్నానాలు చేసేందుకు పోటీపడ్డారు. జలపాతాన్ని సందర్శించేందుకు దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పరిసర ప్రాంతాల్లో ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తాండవ రిజర్వాయర్ వద్ద సందర్శకుల రద్దీ నెలకొంది.

పాతాళ గంగమ్మ పైపైకి..



భారీ వర్షాలతో యలమంచిలి మండలం వెంకటాపురం వద్ద పోలవరం కాలువలోకి చేరిన నీరు

- జిల్లాలో పెరిగిన భూగర్భ జలమట్టం
- అధికంగా వర్షాలు కురవడమే కారణం
- మే నెలతో పోలిస్తే సగటున 4.42 మీటర్ల మీదకు...

యలమంచిలి రూరల్: గంగమ్మ కరుణించింది. పాతాళం వదిలి నెమ్మదిగా పైపైకి కదిలివచ్చింది. జిల్లాలో భూగర్భ జలమట్టాలు పెరిగాయి.గడచిన మే నెలతో పోల్చితే సగటున 4.42 మీటర్ల పైకి వచ్చాయి. మే నెలలో జిల్లా సగటు భూగర్భ జలమట్టం 8 మీటర్ల లోతులో ఉండగా, అక్టోబరు నెలాఖరుకు 3.58 మీటర్ల పైకి వచ్చాయి. సెప్టెంబరు,అక్టోబరు నెలల్లో కురిసిన భారీ వర్షాల కారణంగానే భూగర్భ జలమట్టం 4.42 మీటర్లు పెరిగిందని



యలమంచిలి మండలం పులపర్తి వద్ద బోరు నుంచి వస్తున్న నీరు

నీటి మట్టాలను పరిశీలించి, గణాంకాలు నమోదు చేసిన అధికారులు తెలిపారు. ఆగస్టు చివరి వారంలో,సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షాలతో చెరువులు,నదులు,రిజర్వాయర్లలోకి నీరు చేరింది. వాగులు, వంకలు,గెడ్డల్లో వర్షపునీరు ప్రవహించింది. 2023-24లో జిల్లా సాధారణ వర్షపాతం 1175.44 మిల్లీమీటర్లు కాగా, 988.41 మిల్లీమీటర్ల వర్షపాతంతో 15.8 శాతం లోటు నమోదైంది. 2024-25లో సాధారణ సగటు వర్షపాతం 882.34 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది అక్టోబరు వరకు 1037.73 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.అక్టోబరు నెలాఖరు వరకు 17.61శాతం అధిక వర్షపాతం కురవడంతో జిల్లాలో సగటున భూగర్భ జలమట్టం పెరిగిందని అధికారులు తెలిపారు.

ఏఎస్ పేటలో చేతికందేలోతులో ...

భూగర్భ జల శాఖ అధికారులు ప్రతి నెలా జిల్లాలో అన్ని ప్రాంతాల్లో నీటి మట్టాలను కొలుస్తారు.అక్టోబరు నెలలో తీసిన కొలతల ప్రకారం కశింకోట మండలం ఏఎస్ పేటలో కేవలం 0.08 మీటర్ల లోతులోనే జలం అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు. దేవరాపల్లి మండలం తామరబ్బలో జిల్లాలోనే అత్యధికంగా 22.59 మీటర్ల లోతులో జలం ఉన్నట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి.ఎస్.రాయవరం మండలం ఆర్.కొత్తూరులో కూడా 0.09 మీటర్ల లోతులోనే జలాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో గత రెండు నెలల్లో భూగర్భ జలమట్టాల కొలతలను... గత ఏడాది ఇదే నెలల్లో నమోదైన గణాంకాల ప్రకారం పరిశీలిస్తే 70 ప్రాంతాల్లో జలమట్టాలు పెరగ్గా, మిగిలిన చోట్ల మరింత లోతుకు పడిపోయాయి. మొత్తం 81 ప్రాంతాల్లో జలమట్టాలను నమోదు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.భారీ వర్షాలు కురవడంతో జిల్లాలో చాలా చోట్ల జలమట్టాలు పెరిగాయని తెలిపారు



నక్కపల్లిలో భూగర్భ జలాలను అంచనా వేస్తున్న అధికారులు

జిల్లాలో తాజా నీటి మట్టాలు(మీటర్లలో)

మండలం(గ్రామం)	నీటి మట్టం		
బుచ్చెయ్యపేట(దిబ్బిడి)	1.84	నక్కపల్లి	1.40
చోడవరం(ముద్దుర్తి)	0.92	నర్సీపట్నం	0.41
దేవరాపల్లి(గరిసింగి)	2.26	నాతవరం	1.69
దేవరాపల్లి(తామరబ్బ)	22.59	పరవాడ	2.95
యలమంచిలి	3.51	పాయకరావుపేట	4.41
గొలుగొండ(చోద్యం)	3.12	రాంబిల్లి	8.92
కె.కోటపాడు(గవరపాలెం)	1.14	రావికమతం(కొత్తకోట)	1.96
కశింకోట(ఏఎస్ పేట)	0.08	రోలుగుంట(శరభవరం)	1.22
కోటఉరట్ల	1.84	ఎస్.రాయవరం(ఆర్ కొత్తూరు)	0.09
మాకవరపాలెం	0.29	సబ్బవరం(రావులమ్మపాలెం)	1.30
మునగపాక	1.79	వి.మాడుగుల(జమ్మాదేవిపేట)	1.31
		యలమంచిలి(పద్మనాభరాజుపేట)	0.57


రబీకి అనుకూలం

జిల్లాలో ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో ఆలస్యంగా పంటల సాగు చేపట్టారు. ఆ తర్వాత కురిసిన భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు పెరిగాయి. దీంతో ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు వివిధ పంటలను సాగుకు అనుకూలంగా ఉంది. ఇప్పటికే వ్యవసాయశాఖ రబీకి సంబంధించి పంటల సాగు ప్రణాళిక సిద్ధం చేసింది. అయితే అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పటివరకూ దాని ఊసే ఎత్తడంలేదు. దీంతో జలం అందుబాటులో ఉన్నప్పటికీ సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యాపారులను రైతులు ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం సొమ్ము అందజేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

విస్తారంగా వర్షాలు కురవడంతోనే

ఈ ఏడాది 4.42 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి. ఆగస్టు చివరి వారం, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి.

-జి శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భజల శాఖ



వీణా పాణి... ముత్యాల అలివేణి

పంచరాత్రి ఉత్సవాల్లో భాగంగా యలమంచిలిలో భూలోకమాంబ అమ్మవారు ముత్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి రోజుకో అలంకరణతో విశేష పూజలు నిర్వహిస్తారు. ఆదివారం అమ్మవారు ముత్యాలు, వీణ ధరించి భక్తులకు అభయమిచ్చారు. మహిళలు అమ్మవారిని పసుపు,కుంకుమలతో పూజించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

-యలమంచిలి రూరల్

వినోద్ కుమార్ హత్య కేసులో నిందితుల అరెస్ట్

-8లో

'మిషన్‌లైఫ్'తో నాణ్యమైన విద్యుత్ సరఫరా

మిషన్‌లైఫ్ అమలుకు మద్దతు ప్రకటించిన ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



లైఫ్ మిషన్ పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం: మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని అమలు చేస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి రూపొందించిన 'మిషన్ లైఫ్' పోస్టర్‌ను కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ) సభ్యుడు ప్రవీణ్ గుప్తా, బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరాతో కలిసి సీఎండీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ మిషన్‌లైఫ్ అమలుకు బహిరంగ మద్దతు ప్రకటించిన తొలి డిస్కంగా ఈపీడీసీఎల్ నిలవడం ఆనందంగా ఉందన్నారు. వ్యర్థాల తగ్గింపు, నీరు, ఇంధన సంరక్షణ, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఈఈ సర్టిఫైడ్ ఇంధన సామర్థ్య ఉపకరణాల వినియోగాన్ని ప్రోత్సహించడం తదితర చర్యలపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. బీఈఈ, ఏపీఎస్ఈసీ ఎంతో కలిసి ఈపీడీసీఎల్ పరిధిలో సమగ్ర కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మిషన్ లైఫ్ అమలుతో ఈపీడీసీఎల్ పరిధిలో ఆర్థిక వృద్ధితో పాటు వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరా మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంతో కలిసి బీఈఈ.. మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని తిరుపతిలో అమలు చేసి, దేశవ్యాప్తంగా సుస్థిర విధానాలకు నమూనాగా నిలిపేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. జనవరి 2024 నాటికి ఎస్అండ్ఎల్ కార్యక్రమం పరిధిలోకి 35 ఇంధన సామర్థ్య ఉపకరణాలు వచ్చాయని, దీంతో రూ.54,324 కోట్ల విలువైన 81.64 బిలియన్ యూనిట్ల విద్యుత్తు పొదుపు చేసినట్లు తెలిపారు. డిస్కంలు తమ దీర్ఘకాలిక కమ్యూనికేషన్ వ్యూహాల్లో మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీఈఏ సభ్యుడు ప్రవీణ్ గుప్తా మాట్లాడుతూ రెన్యూవబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్(ఆర్పీవో)పై ప్రాంతీయ వర్క్ షాప్ నిర్వహించిన ఏపీని ప్రశంసించారు. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఆర్పీవో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డైరెక్టర్లు, సీజీఎంలు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి

నర్సీపట్నం డీఎస్పీ మోహన్



మాట్లాడుతున్న నర్సీపట్నం డీఎస్పీ మోహన్

నాతవరం: డివిజన్‌లో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపినట్టు నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్ తెలిపారు. నాతవరం పోలీసు స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ప్రధాన సమస్యలను ఎస్ఐ సీహెచ్. భీమరాజును అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయి రవాణాను నిరోధించేందుకు కృష్ణదేవిపేట, భీమవరం, చీడిగుమ్మల ఎర్రవరంలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆ చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 31వ తేదీలోపు పలు గంజాయి కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న 24 మందిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో దాక్కున్న వారిని సైతం పట్టుకున్నట్టు చెప్పారు. గంజాయి రవాణా చేసే వారిపైనే కాకుండా ప్రోత్సహించే వారిపై కూడా కేసులు పెడతామన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇటీవల ఆన్‌లైన్ మోసాలకు చాలా మంది బలైపోతున్నారని తెలిపారు. అవగాహన సదస్సులు ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నట్టు చెప్పారు.ఈవ్‌టీజింగ్‌ను నిరోధించేందుకు పోలీసుల గస్తీ ముమ్మరం చేశామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తున్నట్టు చెప్పారు.

'విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి నేను ఒకటే చెబుతున్నాను.. ఇది ఆంధ్రుల మనోభావాలకు చెందిన ప్రాజెక్టు. ఉద్యోగులు, యాజమాన్యం ఒక్కటే గుర్తుపెట్టుకోవాలి. మంచి మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేసుకోవాలి. సమర్థవంతంగా ప్లాంట్‌ని నడిపించాలి. సెయిల్ మాదిరిగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించాలి?

ఇవీ.. పరవాడ పర్యటనలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయింపులో చొరవ తీసుకోవల్సిన ముఖ్యమంత్రి ఇలా మాట్లాడడంపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగ కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

బాబూ.. బేల మాటలేల?



సొంత గనుల్లేక విలవిల్లాడుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్

ఈ కారణంగానే సెయిల్ కంటే 3 రెట్లు అదనంగా ఉత్పత్తి వ్యయం

ఈ విషయం తెలిసి కూడా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను నిందించేలా సీఎం వ్యాఖ్యలు

- సెయిల్ మాదిరిగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించాలన్న సీఎం
- మరోవైపు నష్టాల బాటలో ఉన్న ఉక్కును వదిలేసి ప్రైవేటుకి కొమ్ముకాస్తున్న ప్రభుత్వం
- మండిపడుతున్న స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు

సాక్షి, విశాఖపట్నం: ఇటీవల పరవాడ పర్యటనలో మాట్లాడిన సీఎం చంద్రబాబుకు సెయిల్‌కు,విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న తేడా తెలియదా అంటూ కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. సెయిల్‌కు సొంతగనులు ఉండటం వల్లే లాభాల బాటలో పయనిస్తోంది. సెయిల్‌కు, స్టీల్‌ప్లాంట్‌కు ఉత్పత్తి వ్యయంలో చాలాతేడా ఉంది. సెయిల్ తోపోలిస్తే స్టీల్‌ప్లాంట్‌కు మూడురెట్లు ఉత్పత్తి వ్యయం అవుతోంది. సొంతగనులు లేకపోవడమే దీనికి కారణం.ప్లాంట్‌కుగనులు కేటాయించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి గత వైఎస్సార్‌సీపీప్రభుత్వం పలుమార్లువిన్నవించినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ కార్మిక సంఘాలు చంద్రబాబు, పవన్ దృష్టికి సొంతగనుల కేటాయింపు విషయాన్ని పలుమార్లు విన్నవించినా.. కేంద్రంతో ఒక్కసారి కూడా సంప్రదింపులు జరప లేదు. ఇప్పుడు మాత్రం.. లాభాల బాట నడిపించాల్సిన బాధ్యత ఉద్యోగులు, కార్మికులదే అన్నట్లుగా చంద్రబాబు మాట్లాడటంపై ఉక్కు పోరాట కమిటీ నాయకులు మండిపడుతున్నారు.

ఐదు నెలల్లో ఉక్కు కోసం ఏం చేశారు.?

ప్లాంట్‌ను కాపాడుకుంటామంటూ ప్రగల్బాలు పలికిన కూటమి నేతలు ఈ ఐదు నెలల్లో పట్టించుకున్న పాపానపోలేదు.ఉద్యోగులు,కార్మికులకు ఉన్న సదుపాయాల్ని యాజమాన్యం కోత విధించినా స్పందించలేదు. ఉద్యోగుల వీఆర్ఎస్, మరో ప్లాంట్‌కు బదిలీలకు పూనుకున్నా.. ఉద్యోగుల హెచ్ఆర్ఏ తొలగించినా నోరెత్తలేదు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో యూనిట్‌కి రూ.8 చొప్పున విద్యుత్ చార్జీలు పెంచి వసూలు చేసినా మాట్లాడలేదు.లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్,ఎల్‌టీఏ , లాంగ్‌లీవ్ ట్రావెల్ కన్‌సెషన్(ఎల్ఎల్‌టీసీ),ఎల్‌టీసీ(లీవ్‌ట్రావెల్‌కన్‌సెషన్)కూడా నిలిపేశారు. దీనికి తోడు చంద్రబాబు ప్రభుత్వం గోరుచుట్టుపై రోకలిపోటులా రూ.80కోట్ల విద్యుత్‌బిల్లులబకాయిల చెల్లించకపోతే సరఫరానిలిపేస్తామంటూ నోటీసులు జారీ చేసింది.స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇస్తామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం మొదట ఇచ్చిన రూ.500 కోట్లలో రూ.237 కోట్లు జీఎస్టీకి చెల్లించగా మిగిలిన ధనంతో ముడి పదార్థాలు కొనుగోలు చేశారు. రెండోసారి ప్యాకేజీ పేరు తో రూ.1140 కోట్లు ఇచ్చినట్టే ఇచ్చి..బ్యాంకులకు రుణాలపేరిట తిరిగి తీసేసుకుంది. ప్రతి విషయంలోనూ ప్లాంట్‌ని నిర్వీర్యం చేసేందుకుయత్నిస్తుంటే కూటమి నేతలు నోరు మెదపకపోవడం ఏంటని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

మేనేజ్‌మెంట్ బాధ్యత ఎవరిది బాబూ ?

స్టీల్‌ప్లాంట్‌కు మంచి మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేసుకోవాలంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపైనా కార్మికులు మండిపడుతున్నారు. ప్లాంట్‌కు ఉన్నతాధికారుల,సీఎండీ నియామకం మొదలైన బాధ్యతలన్నీ కేంద్రం పరిధిలో ఉంటాయి. కేంద్రంలో ఉన్న ప్రభుత్వంతో జతకట్టిన టీడీపీ,జనసేన ఈవిషయంపై ఎప్పుడూ చర్చించిన పాపానపోలేదు. అలాంటిది.. మంచి మేనేజ్‌మెంట్ ఉద్యోగులు ఏర్పాటుచేసుకోవాలని చంద్రబాబు అనడమేంటని ప్రశ్నిస్తున్నారు.

నక్కపల్లిలో ప్రైవేట్ ప్లాంట్‌కు సొంతగనులా?

అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పైగా దానికి సొంత గనుల కేటాయింపులోనూ రాష్ట్ర ప్రభుత్వం సహకారమందించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఉన్న స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ప్రైవేట్‌కు కొమ్ము కాస్తుండటం చూస్తే.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు విశాఖ ఉక్కుపై ఉన్నది కపట ప్రేమ అని తేటతెల్లమవుతోందంటూ ఉద్యోగ సంఘ ప్రతినిధులు విమర్శిస్తున్నారు.

ఉద్యోగులపై నిందలు వేయడం సరికాదు



స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఉంటే సెయిల్ కంటే ఎక్కువ లాభాలు సాధించేది. ఉక్కు యాజమాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది కాని ఉద్యోగులు కాదు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నంలో చేస్తున్న సహాయ నిరాకరణ వల్ల స్టీల్‌ప్లాంట్ ఈ పరిస్థితికి చేరింది.. తప్పు ఉద్యోగుల వల్ల కాదు. సీఎం చంద్రబాబుకి అందిన తప్పుడు సమాచారం వల్లే ఆయన అలా మాట్లాడుతున్నారేమో.

– మంత్రి రాజశేఖర్, స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి

గనుల కేటాయింపులో వివక్ష కారణంగా..?

గతంలో వరుసగా సాధించిన లాభాలతో 6.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి, ఆ తర్వాత 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికిప్లాంట్ విస్తరణ జరిగింది. ఒక రకంగా విస్తరణ స్టీల్‌ప్లాంట్‌కు నష్టం తెచ్చిందని చెప్పవచ్చు. విస్తరణ పూర్తయ్యే నాటికి ఉన్న వనరులన్నీ కరిగిపోగా రుణాలకు వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా దేశంలోని ప్రైవేటు ప్లాంట్లకు గనులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించడంలో వివక్ష చూపుతూ వస్తుంది. దీని వల్ల ఇతర ప్లాంట్లలో టన్నుకు 40 శాతం ముడి పదార్థాలకు వ్యయం అవుతుండగా సొంత గనులు లేని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 65 శాతం వ్యయం అవుతోంది. కొన్నిసార్లు ఉత్పత్తి వ్యయం కంటే తక్కువకే ఉత్పత్తులను స్టీల్‌ప్లాంట్ అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో గత నాలుగున్నరేళ్ల కాలంలో మూడేళ్ల పాటు నష్టాలను చవిచూసింది. ఈ పరిస్థితుల్లో ప్లాంట్ రుణాలు రూ.20 వేల కోట్లకు మించిపోయాయి. అయితే స్టీల్‌ప్లాంట్ ఈ 30 ఏళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పన్నుల రూపేణా రూ. 40 వేల కోట్లు చెల్లించడం గమనార్హం. వీటిని వద్దని చెప్పినా ప్లాంట్ సజీవంగా బతికేది.



క్లుప్తంగా

కె.జె.పురంలో 2016-17 అక్రమాలపై ఫిర్యాదు

మాడుగుల రూరల్: మేజర్ పంచాయతీ కె.జె.పురంలో గత పాలకవర్గం హయాంలో 2016-17 సంవత్సరంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానిక టీడీపీ నాయకుడు ఆళ్ల శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, హోం మంత్రి అనితతో పాటు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వేర్వేరుగా అనకాపల్లిలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు శివకుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. నాటి టీడీపీ సానుభూతి సర్పంచ్, కార్యదర్శి పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గతంలో డీపీవో, డీఎల్‌పీవో విచారణ చేపట్టారని, నిధుల దుర్వినియోగంపై అప్పటి సర్పంచ్, కార్యదర్శులకు నోటీసులు కూడా పంపించారని గుర్తు చేశారు. గ్రామ సమీపంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యత లోపంపై తాను ఫిర్యాదు చేయగా.. క్వాలిటీ కంట్రోల్ అధికారులు బిల్లులు నిలుపుదల చేశారన్నారు. అయితే ఈ బిల్లులకు సంబంధించి తన సంతకం ఫోర్జరీ చేసి, నకిలీ పత్రం సృష్టించి అధికారులు బిల్లులు చెల్లించారని శివకుమార్ ఆరోపించారు. ఇప్పటికైనా దీనిపై న్యాయం జరగకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

భజనతో కాసులమ్మకు ఘన నివాళి



హార్మోనియం వాయిస్తూ పాటలు పాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

మాడుగుల రూరల్: దివంగత భజన భక్తురాలు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మేనత్త సాలాపు కాసులమ్మ 25వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం కె.జె.పురంలో ఘనంగా జరిగింది. స్థానిక రామాలయంలో భజన చేస్తూ 25 ఏళ్ల కిందట ఆమె మృతి చెందారు. అప్పటి నుంచి ఏటా నవంబర్ 3న ఆమె జ్ఞాపకార్థం భజన కార్యక్రమం నిర్వహించి నివాళులర్పిస్తుంటారు. దీనిలో భాగంగా కె.జె.పురంలో ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. ధర్మశ్రీ స్వయంగా హార్మోనియం వాయిస్తూ కుసుమ హరినాథ భక్తి పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మద్దాల రమణ, చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు, ఆదారి కన్నారావు, యర్రా అప్పారావు, సాలాపు జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతరకు పోదాం.. చలో చలో

- వైభవంగా యలమంచిలి పంచరాత్రి ఉత్సవాలు
- 80 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం
- భారీ విద్యుద్దీపాల సెట్టింగ్‌లతో కాంతులీనుతున్న పట్టణం



విద్యుద్దీపాల అలంకరణతో కాంతులీనుతున్న దిమిలి రోడ్డు



గురప్ప సత్రంలో ఎగ్జిబిషన్ వద్ద భక్తుల సందడి

యలమంచిలి రూరల్: పంచరాత్రి ఉత్సవాలతో యలమంచిలి పట్టణం కాంతులీనుతోంది. పిల్లలు, పెద్దలు, యువతీ, యువకులు ఉత్సవాలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో రావడంతో పట్టణంలో కోలాహల వాతావరణం నెలకొంది. పట్టణంలో ప్రతి ఏటా దీపావళి నుంచి నాగుల చవితి వరకూ భూలోకమాంబ, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవాలు నిర్వహించడం 80 ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఆలయాల సందర్శనతో పాటు యలమంచిలి పంచరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసే భారీ సెట్టింగులు, లైటింగ్‌ను చూసేందుకు పక్క జిల్లాల నుంచి భక్తులు, యాత్రికులు తరలి వస్తున్నారు. యలమంచిలి ప్రధాన రహదారి, తులసీనగర్, దిమిలి రోడ్డు జంక్షన్, పాతవీధి రోడ్డు, సతకంపట్టు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విద్యుద్దీపాలతో రూపొందించిన శ్రీవారి ఆలయం సెట్టింగ్, సుబ్రహ్మణ్యస్వామి కటౌట్, శ్రీరామ పట్టాభిషేక ఘట్టం, దశావతారాలతో విష్ణుమూర్తి రూపం, వినాయకుడు, పరమ శివుడు, దుర్గాదేవి సహా అనేక దేవతామూర్తుల రూపాలతో ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు చూపరులను కట్టిపడేస్తున్నాయి. వీధుల్లో అంతర్గత రహదారులకు ఇరువైపులా కళ్లు మిరుమిట్లుగొలిపేలా వివిధ ఆకతుల్లో నెలకొల్పిన విద్యుద్దీపాలంకరణలు అబ్బురపరుస్తున్నాయి. చివరి రోజైన మంగళవారం నాగుల చవితి రోజు జరిగే జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని నిర్వాహకులు భావిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పట్టణ పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పిల్లలకు ఆట విడుపు

యలమంచిలి పంచరాత్రి ఉత్సవాలు పిల్లలకు ఆట విడుపుగా నిలిచాయి. ఆట వస్తువులతో పాటు, జెయింట్ వీల్, రంగుల రాట్నం, స్ప్రింగ్ మిషన్, గన్‌షూట్, డ్రాగన్ ట్రైన్, గుర్రపు స్వారీ.. ఇలా రకరకాల సరదా ఆటలతో ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. మరో వైపు తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారు, పాతవీధి సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిత్యం చేస్తున్నారు. ఆలయాల వద్ద రోజూ సాయంత్రం ప్రదర్శిస్తున్న విద్యార్థినుల కూచిపూడి, సంప్రదాయ నృత్యాలు అలరిస్తున్నాయి. అలాగే పట్టణంతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు ఈ ఉత్సవాల్లో బొమ్మలు, అలంకరణ వస్తువులు, ఆట వస్తువులు, ఆకర్షణీయమైన గృహోపకరణ వస్తువులు, రకరకాల బెలూన్లు, ఫాస్ట్ ఫుడ్స్, పచ్చబొట్లు వేయడం .. ఇలా అనేక రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు.



జాతరలో పాఠశాల విద్యార్థినుల సంప్రదాయ నృత్య ప్రదర్శన



పాతవీధిలో సుబ్రహ్మణ్యస్వామి సెట్



ప్రధాన రహదారిలో విద్యుద్దీపాలంకరణ



తులసీనగర్ రోడ్డులో భక్తుల సందడి

ప్రాణం తీసిన ఈత సరదా

- సీతపాలెం తీరంలో మునిగిపోయిన యువకుడు
- బోటు సహాయంతో బయటకు తీసుకొచ్చిన మత్స్యకారులు
- అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మృతుడు అభిరామ్ పెందుర్తి మండలం నాయుడుతోట వాసిగా గుర్తింపు



సముద్రంలో బోటులో అభిరామ్‌కు సపర్యలు చేస్తున్న స్నేహితులు, మత్స్యకారులు



మృతి చెందిన అభిరామ్

రాంబిల్లి(యలమంచిలి): ఈత సరదా బీటెక్ పూర్తి చేసిన ఓ యువకుడి ప్రాణం తీసింది. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన యువకుడు కెరటాలకు కొట్టుకుపోయి అందని తీరాలకు వెళ్లిపోయాడు. రాంబిల్లి సీఐ నర్సింగరావు, మృతుడు తండ్రి జగన్నాథరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి మండలం, నాయుడుతోట గ్రామానికి చెందిన శ్రీగుడి వెంకటసాయి అభిరామ్(21) ఆదివారం తెల్లవారు జామున నలుగురు స్నేహితులతో కలసి ద్విచక్ర వాహనాలపై రాంబిల్లి మండలం సీతపాలెం సముద్రం తీరానికి వెళ్లారు. ఉదయం 6 గంటలకు సముద్రంలో సరదాగా స్నానానికి దిగి ఈత కొడుతూ ఉల్లాసంగా గడిపారు. ఉదయం 7.30 గంటల సమయంలో కొంత అలసటకు గురైన అభిరామ్ సముద్రంలో ఉన్న రాయి మీదకు ఎక్కి సేదతీరుతున్నాడు. ఇంతలో అకస్మాత్తుగా ఒక పెద్ద కెరటం వెనక నుంచి వచ్చి ఢీకొట్టడంతో సముద్రంలో పడిపోయాడు. అలల తాకిడికి లోపలికి కొట్టుకుపోతుండగా గమనించిన ముగ్గురు స్నేహితులు స్థానిక మత్స్యకారులకు సమాచారం అందించారు. వారు బోటు సహాయంతో అపస్మారక స్థితిలో ఉన్న అభిరామ్‌ను రక్షించారు. కొన ఊపిరితో ఉన్న అభిరామ్‌ను స్నేహితులు తమ ద్విచక్ర వాహనాల మీద అచ్యుతాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అభిరామ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు, బంధువులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. అభిరామ్ ఇటీవల బీటెక్ పూర్తి చేసి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడని, కొద్ది రోజుల్లో విధుల్లో చేరాల్సి ఉందని రోదించారు. ఒక్కగానొక్క కుమారుడు ఇలా సముద్రంలో అలల తాకిడికి కొట్టుకుపోయి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు విషాదంలో మునిగిపోయారు. జగన్నాథరావు ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ కుమారుడు అభిరామ్‌ను అల్లారు ముద్దుగా పెంచి బీటెక్ వరకు చదివించారు. అంది వచ్చిన ఏకైక కుమారుడు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆస్పత్రిలో ఆవరణలో ఆయన కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది. జగన్నాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాంబిల్లి సీఐ సీహెచ్.నర్సింగరావు తెలిపారు.

కొబ్బరి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన నాగేశ్వరరావు

అచ్యుతాపురం: మండలంలోని ఎం.జగన్నాథపురానికి చెందిన రైతు కరణం నాగేశ్వరరావు(46) ఆదివారం మధ్యాహ్నం కొబ్బరి చెట్టు పైనుంచి జారి పడి మృతి చెందారు. స్థానిక సీఐ నమ్మి గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరణం అప్పలనాయుడు కుమారుడు నాగేశ్వరరావు తన సొంత పొలంలోని కొబ్బరి చెట్టు ఎక్కగా కాలు జారడంతో కింద పడిపోయారు. చేయి విరిగిపోవడంతో పాటు, తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వినోద్‌కుమార్ హత్య కేసులో నిందితుల అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మల్లంపాటి శ్రావణి

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామం కె.ఎస్.ఆర్.పేటలో గత నెల 31న జరిగిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాయబలేరి పట్టణానికి చెందిన వినోద్ కుమార్(23) హత్య కేసులో కె.ఎస్.ఆర్.పేటకు చెందిన మడక గణేష్, ఊడి యశ్వంత్‌లను అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ మల్లంపాటి.శ్రావణి తెలిపారు. మండలంలో కొత్తూరు డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమిత్‌కుమార్, రాంగోపాల్, వినోద్‌కుమార్ కె.ఎస్.ఆర్.పేటలో ఇండస్ట్రియల్ ఏరియాలో మూడేళ్లుగా స్టీల్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 31న ఈ ముగ్గురితో అదే గ్రామానికి చెందిన నిందితులు మడక గణేష్, ఊడి యశ్వంత్ గ్రామంలోని వైన్‌షాప్ పక్కన ఉన్న పాన్‌షాప్ దగ్గర చిన్నపాటి ఘర్షణ పడ్డారు. పాన్‌షాప్ యజమాని, వైన్‌షాప్ వాచ్‌మెన్‌లు మందలించి వారిని పంపించేశారు. అక్కడి నుంచి అమిత్ కుమార్, రాంగోపాల్, వినోద్ కుమార్‌లు విధులు నిర్వహిస్తున్న స్టీల్ కంపెనీలోకి వెళ్లిపోతున్న సమయంలో గణేష్, యశ్వంత్‌లు బైక్‌పై వెళ్లి దాడి చేశారు. దొరికిన వినోద్‌కుమార్‌ను విచాక్షణారహితంగా ఛాతిపైన, ముఖంపైన బలంగా కొట్టారు. కొన ఊపిరిలో ఉన్న వినోద్‌కుమార్‌ను స్థానికుల సహాయంలో 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డీఎస్పీ తెలిపారు. మృతుడు సోదరుడు అమిత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు గణేష్, యశ్వంత్‌లు పరవాడ మండలం సాలాపువానిపాలెం గ్రామం బస్టాప్ వద్ద హైదరాబాద్ వెళ్లిపోవడానికి నిరీక్షిస్తున్న సమయంలో శనివారం అరెస్ట్ చేసినట్లు ఆమె చెప్పారు. నిందితులను ఆదివారం న్యాయమూర్తి వద్ద హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

7న వీవోఏల ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న రూపాదేవి

అనకాపల్లి: వెలుగు వీవోఏలుగా పనిచేస్తున్న యానిమేటర్లను ప్రతి మూడు సంవత్సరాలకు రెన్యువల్ చేయాలన్న సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని, బకాయి పడిన ఐదునెలల వేతనాన్ని చెల్లించాలన్న డిమాండ్‌తో ఈనెల 7న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్టు ఏపీ వెలుగు వీవోఏ(యానిమేటర్స్)ల సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి సీహెచ్.రూపాదేవి తెలిపారు. స్థానిక దొడ్డి రాము నాయుడు భవనలో సంఘం గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ఆదిలోనే వీవోఏలపై కత్తి కట్టిందన్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు విస్మరించిందని తెలిపారు. ఐదు నెలలకు ఒకసారి కార్మికులకు ఒక నెల జీతం మాత్రమే ఇస్తున్నారని, ప్రతి నెలా జీతాలు చెల్లించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ తదితర సదుపాయాలు కల్పించాలని ఆమె కోరారు. డిమాండ్ల సాధనకు ఈనెల 11, 12 తేదీల్లో నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కలెక్టర్ కార్యాలయాలు వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎం.రాజేష్, రాము, లక్ష్మి, కె.ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

50 మద్యం బాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న 50 మద్యం బాటిళ్లను ప్రదర్శిస్తున్న ఎస్‌ఐ ఈశ్వరరావు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల పంచాయతీ పరిధిలో ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తగరంపూడి గ్రామానికి చెందిన సంమంగి నాగరాజు నుంచి 50 మద్యం క్వార్టర్ బాటిళ్లతో స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు నాగరాజుపై కేసు నమోదు చేశామన్నారు.

విశాఖ ఉమ్మడి జిల్లా సమస్యలు విస్మరించిన సీఎం

- రెండు రోజుల పర్యటనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం

అనకాపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటన వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, విశాఖ ఉమ్మడి జిల్లా సమస్యలు విస్మరించారని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యను ప్రస్తావించకుండా పెట్టుబడులు, సంపద సృష్టి చుట్టే ఉపన్యాసాలు సాగాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ అంటే నాకు ఎంతో ఇష్టమని చెప్పిన చంద్రబాబు లక్షల మంది జీవితాలతో ముడిపడిన విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఎందుకు ప్రసావించలేదని ఆయన ప్రశ్నించారు. బ్లాస్ట్ ఫర్నేస్-2ని పునః ప్రారంభించి, దానికి కావలసి ముడిసరుకు గురించిగాని, సెయిల్‌లో విలీనం, సొంత గనుల కేటాయింపు, వర్కింగ్ క్యాపిటల్ గురించి ప్రస్తావించకపోవడం విశాఖ ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడకుండా నక్కపల్లిలో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌ను తీసుకొచ్చి ఎన్ఎండీసీతో అనుసంధానం చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఎంతచిత్తశుద్ధి ఉందో ఇక్కడ ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు. ఎస్ఈజెడ్‌లో వేలాది ఎకరాలు ఖాళీగా ఉన్నప్పటికీ కొత్తగా ఎస్ఈజెడ్ తీసుకువస్తామని చెప్పి భూములు సేకరించడం ఏమిటని ప్రశ్నించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది(విశాఖ): సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణి స్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

కొనసాగుతున్న కార్తీ దామోదర మాసోత్సవాలు

కార్తీక దామోదర మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వేకువ జామున 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు, మంగళహారతి, నరసింహ హారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీప సమర్పణ, గజేంద్ర స్తుతి, దామోదరాష్టకం, గోపి గీత, భగవద్గీత, శిక్షాష్టకం, యుగలాష్టకం పారాయణం నిర్వహించినట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు.

పంచారామాలకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు



పంచారామ దర్శనానికి ఆర్టీసీ బస్సులో పయనమైన భక్తులు

డాబాగార్డెన్స్: కార్తీక మాసంలో ఒక్క రోజులో పంచారామాలు దర్శనం చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించింది. ద్వారకా బస్టేషన్ నుంచి ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సు బయలుదేరింది. పంచారామాలను దర్శించుకునే భక్తుల కోసం ఆదివారాల్లో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు తెలిపారు. సూపర్ లగ్జరీ ప్రయాణ చార్జీ రూ.2,150, అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.2,100గా నిర్ణయించామన్నారు. పంచారామాలను దర్శించుకునే భక్తులు www.apsrtconline.in ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. రిజర్వేషన్ కౌంటర్ వద్ద కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 99592 25602, 90522 27083లో సంప్రదించాలని ఆయన సూచించారు.

శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా కృష్ణకుమార్



సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీగా ఆత్మకూరి కృష్ణకుమార్ ఎన్నికైనట్టు ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకర్‌రావు ప్రథమ కుమారుడు కృష్ణకుమార్ ఇప్పటివరకు ట్రస్టీగా ఉన్నారు. 2023 ఫిబ్రవరిలో మేనేజింగ్ ట్రస్టీ పదవికి మణిమాల రాజీనామా చేయడంతో అప్పటి నుంచి ఎవరినీ నియమించలేదు. రెండు రోజుల కిందట శంకర్ ఫౌండేషన్ బోర్డు చైర్మన్ ఎం.రాందాస్ అధ్యక్షతన జరిగిన 172వ ట్రస్ట్‌బోర్డు సమావేశంలో కృష్ణకుమార్‌ను మేనేజింగ్ ట్రస్టీగా ప్రొఫెసర్ ఎ.ప్రసన్నకుమార్, ఆత్మకూరి విజయ్‌కుమార్ తదితరులు ఎన్నుకున్నారు. ఏయూలో అప్లైడ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన కృష్ణకుమార్ 13 ఏళ్లకు పైగా శంకర్ ఫౌండేషన్ బోర్డులో పని చేశారు. మేనేజింగ్ ట్రస్టీగా ఎన్నికైన కృష్ణకుమార్‌ను ఆస్పత్రి వైద్యులు, ఉద్యోగులు అభినందించారు. ఆయిన నాయకత్వంలో శంకర్ ఫౌండేషన్ మరింత గణనీయమైన ప్రగతిని సాధిస్తుందన్నారు. కాగా గడిచిన 27 ఏళ్లలో 2.68 మిలియన్ల రోగులకు కంటి పరీక్షలు, 4,61,345 మందికి శస్త్రచికిత్స చేసినట్లు బంగార్రాజు తెలిపారు. శంకర్ ఫౌండేషన్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా కృష్ణకుమార్ తెలిపారు.

అయోమయం.. గందరగోళం!

- తేలని మున్సిపల్ టీచర్ల పదోన్నతుల లెక్క
- ఈ నెల 6, 8 తేదీల్లో ప్రమోషన్ల కౌన్సెలింగ్
- ఇంకా బయటకు రాని సీనియారిటీ జాబితాలు
- ఖాళీల వివరాలు వెల్లడించని విద్యాశాఖాధికారులు
- ఎయిడెడ్ టీచర్ల సర్దుబాటుతో సమస్య జటిలం



మున్సిపల్ స్కూల్లో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

విశాఖ విద్య: పాఠశాల విద్యలోకి విలీనమైన తరువాత తొలిసారిగా జరుగుతున్న మున్సిపల్ టీచర్ల పదోన్నతుల ప్రక్రియ గందరగోళంగా మారుతోంది. జీవీఎంసీ పరిధిలోకి వచ్చే విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పదోన్నతుల కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తుండగా, జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు అవలంభిస్తున్న విధానాలు వీరిని అయోమయానికి గురిచేస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో అన్ని క్యాడర్లు కలిపి 449 ఖాళీలు ఉన్నట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ జీవీఎంసీ పరిధిలో క్యాడర్ల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయి? ఎంతమందికి పదోన్నతులిస్తారనే స్పష్టత లేకపోవటంపై ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జాబితాల వెల్లడిలో జాప్యం

జీవీఎంసీ పరిధిలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల సీనియార్టీ జాబితాలను అక్టోబర్ 28న ప్రకటించాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ, ఈ నెల 1న వీటిని వెల్లడించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అది కూడా కొన్ని సబ్జెక్టులకే. గ్రేడ్-2 హెచ్ఎం, పీఎస్ హెచ్ఎం, ఎస్ఏ గణితం, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ సైన్సు, సోషల్ సబ్జెక్టులకు మాత్రమే జాబితాలు విడుదల చేశారు. తెలుగు, హిందీ సబ్జెక్టులకు సంబంధించిన జాబితాలు ప్రకటించలేదు. సోమవారం నాటికి అభ్యంతరాలను స్వీకరించి, ఫైనల్ జాబితాలను ప్రకటించాల్సి ఉంది. దీనిపై సరైన సమాచారం లేకపోవటంతో తమ అభ్యంతరాలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ఖాళీలపై స్పష్టత ఏదీ?

ఎయిడెడ్ స్కూళ్ల నుంచి ఇటీవల ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినప్పుడు, కొంతమందికి జీవీఎంసీ పరిధిలో పోస్టింగ్‌లు ఇచ్చారు. అప్పటి అధికారుల హయాంలో జరిగిన లోపాయికారీ ఒప్పందాలు ఇప్పుడు సమస్యగా మారినట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చసాగుతోంది. పోస్టుల సర్దుబాటు తరువాత క్యాడర్ స్ట్రెంత్‌ను సరిచేయకపోవటంతో, ప్రస్తుతం ఇచ్చే ప్రమోషన్లలో రోస్టర్ కేటాయింపు లెక్కతప్పింది. జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ సైతం ఇదే విషయాన్ని ఎత్తిచూపటంతో, ఖాళీల గుర్తింపు వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. వాస్తవంగా ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది తెలిస్తేనే, రోస్టర్ అమలు, డీఎస్సీకి ఎన్ని కేటాయించాలి, పదోన్నతుల్లో ఎన్ని భర్తీ చేయాలన్నది తెలుతుంది. దీనిపై స్పష్టత లేకపోవటంతో షెడ్యూల్ మేరకు పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగుతుందా? లేదా? అనే అనుమానాలను ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు.

పదోన్నతుల షెడ్యూల్

సీనియార్టీ జాబితా ప్రకటన	అక్టోబర్ 28
అభ్యంతరాల స్వీకరణ	నవంబర్ 4
గ్రేడ్-2 హెచ్ఎంల కౌన్సెలింగ్	నవంబర్ 6
ఎస్ఏ/పీఎస్ హెచ్ఎంల కౌన్సెలింగ్	నవంబర్ 8

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ A.P. ఓపెన్ స్కూల్ 10th, 12th, ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల నుండి డిస్టెన్స్ B.A. B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA లకు పాస్ గ్యారంటీ గైడెన్స్. ఫోన్ : 99668 48898 [V- 786948]

Real Estate

PLOT FOR SALE

■ VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు కంచికచర్లలో DTCP, AP CRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర: 93985 76997 [B-93]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

■ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లో తనఖా ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. మిగిలిన డబ్బు తక్షణమే ఇవ్వబడును. స్పాట్ క్యాష్, EV Gold, Ph: 70750 86333. [V- 1320]

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ. పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253905]

■ Wanted Female Teachers for LKG, UKG & 1st to 3rd & English, Hindi, Telugu Subjects Teachers for 4th to 7th Std. English Fluency is must. Sal. : 10,000/-. Ph : 95811 26947, Old Post Office [V- 823879]

■ బోయపాలెం, పేపాడ, సిరిపురం ఏరియాల్లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. చదవడం, రాయడం తెలియాలి. శాలరీ : 12 గంటలకు 14,000/-. ఫోన్ : 91001 03011, 63046 46035 [V- 2711]

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటివద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. వీక్లి పేమెంట్స్ వీక్లి 4000/- వివరాలకు వాట్సాప్/ కాల్ ✆ 9885682589 [G-9059]

www.sakshi.com

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/-
అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

8 నుంచి సీపీఎం నిరసనలు

అనకాపల్లి: రాష్ట్రంలో నిత్యావసర సరకుల అధిక ధరలపై సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోవడంతో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలు ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ: కార్తీకమాసం ప్రారంభం కావడంతో వెంకటరాంపురం పంతులుబాబు విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రాంతంతో ఎంతో గొప్ప పేరు పొందిన పాకలపాడు పంతులు బాబు ఆశ్రమం నుంచి విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమంలో పుత్తడిగైరంపేట, వెంకటరాంపురం, ఎర్రవరం గ్రామస్తులు పాల్గొన్నారు. కార్తీకమాసం నెలరోజులపాటు ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. భక్తు లకు ఆరాధ్య దైవంగా భావించే ఆశ్రమంలో ప్రతి సోమవారం అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వైభవంగా అయ్యప్ప అంబలం పూజ



చిత్రపటాలతో దేవతామూర్తులను ప్రతిష్ఠించి అలంకరించిన అయ్యప్పస్వాములు

నాతవరం: స్థానిక నల్లగొండమ్మ ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప అంబలం పూజ శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు పోలిరెడ్డి రాజు ఆధ్వర్యంలో పూజా మండపాన్ని 18 మెట్లు అందంగా తయారు చేశారు. అయ్యప్ప స్వామి దేవతామూర్తులు చిత్రపటాలతో ప్రతిష్ఠించి పూలతో అలంకరణ చేయడంతో చూపరులను ఎంతోగానో ఆకట్టుకుంది. గణపతి పూజతో కార్యక్ర మాన్ని ప్రారంభించి అయ్యప్పస్వామి భక్తి గీతాల తో చేసిన భజనలు భక్తులను రంజింపజేశాయి. పూజా కార్యక్రమాన్ని చూసేందుకు గ్రామంలో అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేశారు. అయ్యప్ప నామ స్మరణతో ఈ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ నేడు

కోటవురట్ల: సచివాలయ సిబ్బంది, కార్యదర్శులకు సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ శిక్షణ ప్రారంభమవుతుందని, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు హాజరు కావాలని సూచించారు.

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
'క'	:సత్యనారాయణస్క్రీన్-1
అమరాన్	:సత్యనారాయణస్క్రీన్-2
వేట్టయాన్	:షిర్డిసాయి
జనక అయితే గనక	:పర్తిసాయి
బఘీర	:వెంకటేశ్వర
విశ్వం	:శ్రీసత్య
లక్కీభాస్కర్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 263 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 196 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి



బీజ గణిత భావనలను వివరిస్తున్న విద్యార్థులు



ఆట ఆడుతూ రేఖా గణితం గురించి వివరిస్తున్న విద్యార్థులు



నాటిక రూపంలో గణిత భావనలపై అవగాహన

ఆడుతూ పాడుతూ.. గణిత అభ్యసన

వెదురుపర్తి పాఠశాలలో వినూత్న రీతిలో లెక్కల బోధన • సులువుగా నేర్చుకుంటున్న విద్యార్థులు

గణిత శాస్త్రాన్ని అభ్యసించడానికి ఎక్కువ మంది విద్యార్థులు భయపడతారు. ప్రాథమిక గణితం, గణిత భావన, చతుర్విధ ప్రక్రియ వంటివి అర్థం చేసుకోవడం కష్టమనుకుంటారు. దీనివల్ల విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తి సన్నగిల్లుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన గణిత ఉపాధ్యాయులు విద్యార్థులకు వినూత్న రీతిలో బోధన సాగిస్తూ గణితం పట్ల ఆసక్తిని రేకెత్తిస్తున్నారు. గణిత భావనలను కథలు, చిన్న నాటికలు, నృత్యం, ఆటలు, పాటలు, నమూనాల రూపంలో ప్రదర్శిస్తున్నారు.

కశింకోట: ఆ పాఠశాల విద్యార్థులు గణితం అంటే భయపడకుండా సులువుగా నేర్చుకునేలా ఉపాధ్యాయులు సరికొత్త రీతిలో లెక్కల పాఠాలు చెబుతున్నారు. గణిత శాస్త్రవేత్త శకుంతలాదేవి గణిత క్లబ్ పేరిట ఏడాది పొడవునా అవగాహన కలిగిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు పొందుతున్నారు. ఇందుకు కశింకోట మండలంలోని వెదురుపర్తి హైస్కూలు వేదికగా మారింది. శకుంతలాదేవి జయంతిని నవంబర్ 4న జాతీయ గణిత శాస్త్ర దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

మారుమూల పాఠశాలలో..

వెదురుపర్తి జెడ్పీ హైస్కూల్ మారుమూలన ఉంది. అక్కడ పని చేస్తున్న గణిత ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి విద్యార్థుల్లో గణితం పట్ల భయాన్ని పోగొట్టడానికి 2019లో గణిత శాస్త్రవేత్త శకుంతలాదేవి గణిత క్లబ్‌ను నెలకొల్పారు. విద్యార్థులను క్లబ్‌లో సభ్యులుగా చేర్చి గణిత పాఠ్యాంశాల పట్ల ఆసక్తి కలిగిస్తూ వినూత్నంగా నాటికలు, నృత్యం, ఆటలు, పాటల ద్వారా సెలవు రోజులు, పాఠశాల పని వేళలు ముగిశాక బోధన చేపట్టి విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వడంతో సత్ఫలితాలు వచ్చాయి. దీంతో వాటిని తరగతుల్లో, పాఠశాల ఆవరణలో ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కలిగించడం ప్రారంభించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం పరిచయం చేసిన పునాది అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం, అభ్యసన అభివృద్ధి కార్యక్రమం, సరైన స్థాయిలో బోధన వంటి కార్యక్రమాల లక్ష్యాలను సాధించడానికి వినూత్న బోధన ద్వారా సంతోషకరమైన అభ్యాసం చేపట్టారు. ఆ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. విద్యార్థి వినడం వల్ల 25 శాతం, చూడటం వల్ల 50 శాతం, చేయడం వల్ల 75 శాతం, నిజ జీవితంలో ఆ భావనలు ఉపయోగించడం వల్ల శత శాతం గణిత భావనలు నేర్చుకునే అవకాశం కలుగుతుంది. దీని దృష్ట్యా వెదురుపర్తి హైస్కూలు విద్యార్థుల గణిత భావనలను కూడా నిజ జీవితంలో ఉపయోగపడే విధంగా బోధనలు సాగిస్తుండటంతో వాటిని గుర్తుంచుకునే అవకాశం కలుగుతోంది. పాఠ్య పుస్తకాల్లో ఉన్న గణిత భావనలను నేర్పించడానికి విద్యార్థులను క్షేత్రస్థాయికి కూడా తీసుకెళ్లి రేఖా గణితం, క్షేత్రమితి, బీజగణితం వంటి అంశాలపై అవగాహన కలిగించడంతో పాటు పాఠశాల పరిసరాలను సైతం గణిత అభ్యాసనకు వినియోగిస్తున్నారు. దీనివల్ల గణిత భావనలను విద్యార్థులు జీవితంలో మర్చిపోలేరని, గణితంపై ఆసక్తి పెరగడంతో పాటు చేతి నైపుణ్యం, టీం వర్క్, మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, స్నేహ భావం అలవడడానికి అవకాశం కలుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గణితం అంటే భయపడే విద్యార్థులు సైతం వినూత్న బోధనతో గణిత అభ్యాసనలో అభివృద్ధికి అవకాశం కలుగుతుందంటున్నారు. ఏడాది పొడవునా ఈ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహిస్తూ గణిత శాస్త్ర వేత్త శకుంతలాదేవి గణిత వారోత్సవాలు, జాతీయ గణిత దినోత్సవాలు, మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు.



తరగతి గదిలో విద్యార్థుల గణిత అభ్యసన



నృత్య రూపంలో కోణాలు వివరిస్తున్న విద్యార్థినులు



బిస్కెట్లతో సంఖ్యా వర్గం, వర్గ మూలం కనుక్కునే విధానం వివరిస్తున్న విద్యార్థులు

గణితంతోనే భవిత



గణితం పట్ల భయాన్ని పోగొట్టి విద్యార్థుల్లో ఆసక్తి కలిగించడానికి ఆట, పాటలు, నాటికలు, నృత్యాల ద్వారా వినూత్న రీతిన బోధన సాగిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో కూడా గణిత భావనలపై అవగాహన కలిగిస్తున్నాం. దీనివల్ల విద్యార్థుల్లో గణితం పట్ల ఆసక్తి పెంపొందుతుంది. నిజ జీవితంలో గణితం విద్యార్థులకు ఉపయోగపడనుంది.

– ఏవీఎస్ మూర్తి, గణిత ఉపాధ్యాయుడు, వెదురుపర్తి హైస్కూల్, కశింకోట మండలం

ఫార్మా కార్మికులకు భద్రత కల్పించాలి

అనకాపల్లి: జిల్లాలో ఫార్మా కంపెనీల్లో నిత్యం అగ్ని ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శనివారం పరవాడ మండలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశం ముగిసిన గంటలోనే ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం జరిగిందన్నారు. జిల్లాలో గల ఫార్మా కంపెనీలు, స్పెషల్ ఎకనామిక్ జోన్లలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల భద్రత, సంక్షేమం కోసం కనీసం ఒక్క మాటైనా మాట్లాడలేదని వారు ఆరోపించారు. పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పడం తప్ప ఉన్న పరిశ్రమల్లో కార్మికులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించడం లేదన్నారు. అచ్యుతాపురం స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో అభిజిత్ కంపెనీ మూతపడి 22 రోజులు అయిందని, సుమారు 1000 కుటుంబాలు వీధిన పడ్డాయని, దీనిపై చంద్రబాబునాయుడు ఒక్క మాట కూడా చెప్పలేదన్నారు. ఫార్మాలో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారని, కంపెనీ భద్రతా చర్యలు తీసుకోకపోతే తీవ్రమైన శిక్షలు ఉంటాయని కనీసం హెచ్చరిక కూడా లేదన్నారు. కంపెనీలకు భూములు ఇచ్చిన స్థానికులకు ఉపాధి లేక వీధిన పడ్డారని వారికి ఉపాధి కల్పించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీలకు వేల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు,కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

సుపథ ప్రతిభ పరీక్షలకు 435 మంది హాజరు

దేవరాపల్లి: విద్యార్థుల్లో మానవతా విలువలు పెంపొందించడంతో పాటు మాతృభాష, భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణే సుపథ ధ్యేయమని ఆ సంస్థ రూపకర్త యు.వి.ఎ.ఎన్.రాజు అన్నారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సుపథ ప్రతిభా పరీక్షలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లో ప్రారంభించిన సంస్థ ద్వారా ప్రస్తుత తరానికి మానవతా విలువల ఆవశ్యకతను వివరిస్తూ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో 20 ఏళ్లుగా సుపథ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలో పద్య పఠనం, శ్లోక పఠనం, సుపథ గేయాలు, కృష్ణాష్టకం ప్రతిభ పరీక్షలను నిర్వహించారు. నాకు నచ్చిన దేశ నాయకుడు, మంచి విద్యార్థి అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 25 పాఠశాలల నుంచి 435 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాయంత్రం విజేతలకు సంస్థ వ్యవస్థాపకుడు రాజు, సంస్థ సభ్యులు, మాజీ ఎంపీపీ భాస్కరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సుపథ కార్యకర్తలు కె. శ్రీనివాసు, బి.వి. దేముళ్లు, వై.బి.వి. ఉదయ్‌కుమార్, డి.దేముడు, సిహెచ్.సూర్యనారాయణ, వై.త్రినాథ్, ఐ.నారాయణరావు, నాగ కరుణ, జి.చిన్నంనాయుడు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

తొలి సోమవారం పూజలకు సిద్ధం



విద్యుద్దీపాల అలంకరణలో కశింకోట శివాలయం



కశింకోట ఆలయంలో లక్ష్మీనృసింహ స్వామి



డీపీఎన్ హైస్కూల్ వద్ద ఆలయంలో కొలువైన గౌరీపరమేశ్వరులు



కశింకోట ఆలయంలో పురాతన శివలింగం

కశింకోట: మండలంలోని శివాలయాలు కార్తీక మాసం తొలి సోమవారం పూజలకు సిద్ధమయ్యాయి. కశింకోట శివాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు వి.చిదంబరం, కృష్ణ తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. లక్ష్మీనృసింహ స్వామి ఆలయం, ధ్యాన వేంకటేశ్వర స్వామి, గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, కస్పావీధిలోని ఉమా సాంబమూర్తి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు. కార్తీక మాసం సందర్భంగా డీపీఎన్ హైస్కూల్, గవరపేట, వెలంపేట ప్రాంతాల్లో నెలకొల్పిన గౌరీపరమేశ్వరుల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. వెదురుపర్తి, బయ్యవరం, పేరంటాలపాలెం, సోమవరం, నూతలగుంటపాలెం, చింతలపాలెం, కన్నూరుపాలెం, తేగాడ ప్రాంతాల్లోని శివాలయాలు, ఏఎస్ పేటలోని సాంబశివుని ఆలయం, తాళ్లపాలెం సంతలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బంగారయ్యపేటలోని బసవేశ్వర స్వామి ఆలయం, సాంబమూర్తి ఆలయం, ఉగ్గినపాలెంలోని సోమేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

త్వరలో శారదా నది ఘాట్ సుందరీకరణ



శారదా ఘాట్ వద్ద చెత్తను తొలగిస్తున్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

తుమ్మపాల: శారదా నది ఘాట్‌ను త్వరలో సుందరీకరిస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఘాట్ వద్ద గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆయన పరిశీలించా రు. పర్యావరణ పరిరక్షణ అందరి భాధ్యత అని జలసంరక్షణ పట్ల అందరూ బాధ్యతగా ఉండాలన్నారు. ఘాట్‌ను ఆధునికీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేస్తామన్నారు. బోటింగ్, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులతో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, క్లబ్ నిర్వాహకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నదిలో పారవేయొద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహ న కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, పెంటకోట ఉమామహేశ్వరరావు, యల్లపు సూరి అప్పారావు, బేతాళం శేషసాయి, ఏఎంఏఎల్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించాలి



సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కస్తూర్బా పాఠశాలను పరిశీలించిన ఆయన అక్కడ పలు సమస్యలను గుర్తించినట్లు స్థానిక విలేకరులకు తెలిపారు. నాడు-నేడులో అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని, నిరుపయోగంగా ఉన్న సోలార్ ప్యానల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అరకొరగా ఉన్న తరగతి గదులు, బాత్ రూమ్‌లు, ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పాఠశాలలో 259 మంది విద్యార్థులు ఉన్నారని, సైన్స్, తెలుగు ఉపాధ్యాయులు లేక ఆ సబ్జెక్టులలో సక్రమంగా విద్యా బోధన జరగని పరిస్థితి నెలకొందన్నా రు. మేడపై 11 బాత్ రూమ్‌లు ఉన్నప్పటికీ సెప్టిక్ ట్యాంక్ మూత పడిపోవడంతో వినియోగంలో లేక విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. సోలార్ ప్యానల్ పనిచేయడం లేదని, ఇన్వర్టర్లు సరిపోక రాత్రి పూట విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినపుడు అవస్థలు పడుతున్నారన్నారు. కస్తూర్బా పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



కె.కోటపాడులో గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు



గౌరీపరమేశ్వరుల ఊరేగింపు

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ గవర వీధి వాసులు శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉత్సవాలను ప్రారంభించారు. దీనిలో భాగంగా ఉత్సవ మూర్తుల విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం దగ్గర నుంచి అబిద్‌సెంటర్ మీదుగా ఊరేగింపుగా గవరవీధి తరలించి, మండపంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్తీక మాసం నెల రోజులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం సారె చీరతో అమ్మవారిని నిమజ్జనం చేస్తారు. విగ్రహాల ఊరేగింపులో మహిళలు పాల్గొన్నారు.

కె.కోటపాడులో గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ

కె.కోటపాడు: కె.కోటపాడు గ్రామంలో గల గౌరీ పరమేశ్వరుల విగ్రహ ఏర్పాటు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గౌరీపరమేశ్వరుల ఆలయంలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. నాగుల చవితి పర్వదినం రోజున గ్రామంలో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని జరపనున్నారు. గౌరీపరమేశ్వరులకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పూజలు జరిపారు.

రోలుగుంట: కొవ్వూరు గ్రామంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో గౌరీపౌర్ణమి రోజు నుంచి ఈ ఉత్సవాలు ముగింపు రోజు వరకూ రాత్రిళ్లు భజన, చిడతలు, కోలాటం, జానపద, పౌరాణిక ప్రదర్శనలను నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా సర్పంచ్ కాంతమ్మ గ్రామంలో మహిళలకు కోలాటంపై శిక్షణ ఇచ్చి ప్రదర్శిస్తున్నారు. మహిళలు ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాయకరావుపేట: ఈ నెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం వారోత్సవాల నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14న బాలల దినోత్సవం నిర్వహించి చిన్నారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలుంటాయన్నారు. మిగతా రోజుల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్‌గా విభజించి పలు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

విస్తారంగా టమాటా సాగు

కె.కోటపాడు: మండలంలో పలు గ్రామాల్లో గల రైతులు టమాటా పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. టమాటా పంటకు మార్కెట్ లో ప్రస్తుతం మంచి మద్దతు ధర లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలవ్యవధిలో దిగుబడి ప్రారంభమయ్యే పంట కావడంతో టమాటా సాగును రైతులు చేపడుతున్నారు. మండలంలో బొట్టవానిపాలెం, కె.కె.అగ్రహారం, సూదివలస, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, ఆర్లి, కింతాడ, పిండ్రంగి, కొరువాడ తదితర గ్రామాల్లో 150 ఎకరాలలో పంట సాగు చేస్తున్నారు. పంటను కె.సంతపాలెం, పెందుర్తి, విశాఖపట్నం ప్రాంతాల్లో గల రైతు బజార్‌లలో అమ్మకాలకు తీసుకువెళుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

వృద్ధులు, విద్యార్థులకు వితరణ



వృద్ధులకు దుస్తులు అందిస్తున్న ప్రజాప్రతినిధుల సంఘం అధ్యక్షురాలు అక్కయ్యమ్మ

నాతవరం: సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలక మని మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు అన్నా రు. మండల కేంద్రంలో ఆదివారం అమ్మ వాసవీ స్వచ్ఛంద సేవా సంఘం మండల శాఖ అధ్యక్షురాలు ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ, సంఘం గౌరవ అధ్యక్షుడు పేరూరి బుల్లిదొర పేదలకు దుస్తులు, విద్యార్థులకు సామగ్రి అందజేశారు. వాటిని ప్రజాప్రతినిధుల చేతుల మీదు గా 120 మంది వృద్ధులకు దుస్తులు, 140 మంది విద్యార్థులకు చదువుకోవడానికి కావలసిన సామాగ్రి పంపిణీ చేశారు. అమ్మ వాసవీ సేవా సంఘం ఈ ప్రాంతంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో నర్సీపట్నం జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాజాన సూర్యచంద్ర, నాతవరం మాజీ ఎంపీటీసీ సభ్యుడు అపిరెడ్డి మాణిక్యం పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com